క్లుప్తంగా

శ్రీవారి నిత్యానదాన ట్రస్ట్‌కు విరాళాలు



దాత కౌశిక్‌కి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ముగ్గురు భక్తులు ఆదివారం వేరువేరుగా విరాళాలు అందజేశారు. అందులో భాగంగా తాడేపల్లిగూడెంకు చెందిన కొండేటి వీరవెంకట సూర్యకుమారి రూ:1,01,201 ఆలయ కార్యాలయంలో జమచేయగా దాతకు ఆలయ ఏఈవో పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు. ఏలూరుకు చెందిన రాయప్రోలు వెంకట రామ వినయ కౌశిక్ రూ: 1,01,116 నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేయగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ డీవీఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. అలాగే ఏలూరుకు చెందిన సేనం శ్రీకాంత్ రూ. 27 వేలను విరాళంగా అందజేయగా దాతకు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఘనంగా గజ్జె పూజ మహోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన నృత్యాంజలి కళానికేతన్ ఆధ్వర్యంలో నాట్యాచార్య గండికోట రాజేష్ నృత్య శిక్షణలో కూచిపూడి, జానపద నృత్యాలలో శిక్షణ పొందుతున్న 70 మంది చిన్నారులకు ఆదివారం వైఎంహెచ్ఏ హాలులో గజ్జె పూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత శాస్త్రోక్తంగా వేద పండితులతో గణ పతి పూజ నిర్వహించి నృత్య ఆరాధన దైవం నటరాజ స్వామికి పూజ నిర్వహించారు. అనంతరం పూజలో ఉంచిన గజ్జెలను నాట్యాచార్య గండికోట రాజేష్. శిష్యుల కాళ్లకు అలంకరించారు.

రేపు భీమడోలులో జాబ్ మేళా

భీమడోలు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనాధికారి సంయుక్త ఆధ్వర్యంలో భీమడోలు వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఈనెల 10వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి గంటా సుధాకర్, ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్, స్కిల్ హబ్ కళాశాల ఇన్‌చార్జి జంగం రాములు అన్నారు. వివిధ రకాల కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని వారు ఆదివారం వెల్లడించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు గల నిరుద్యోగులు జాబ్ మేళా హాజరు కావాలని వారు కోరారు.

జల వలయంలో కొల్లేరు ప్రాంతాలు

- గుడివాకలంక ఎస్సీ కాలనీలోకి వరద నీరు
- తాగునీరు ఇవ్వలేదంటూ కోమటిలంక ప్రజలు ఆగ్రహం
- అధికారులు పట్టించుకోలేదని అసహనం



గుడివాకలంక పక్షుల విడిది కేంద్రం ప్రధానరోడ్డుపై ప్రవహిస్తున్న వరద



వరద ఉధృతి తగ్గాలని గంగమ్మను వేడుకుంటున్న గుడివాకలంక వాసులు



గుడివాకలంక ఎస్సీ కాలనీలో వరద నీరు



మాధవాపురం వద్ద రోడ్డుపై నుంచి వరద ప్రవాహానికి కొట్టుకుపోతున్న బైక్

ఏలూరు రూరల్: వరద ఉధృతి ఆదివారం సైతం పెరగడంతో కొల్లేరు గ్రామాలు ముంపుబారిన పడుతున్నాయి. తమ్మిలేరు, బుడమేరు నుంచి వస్తున్న వరద నీటితో ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక ఎస్సీ కాలనీ ముంపుబారిన పడింది. ఉదయం 11 గంటలకు కాలనీలో అడుగు ఎత్తున నీరు చేరింది. ఇది చూసిన కాలనీలో మహిళలు గగ్గోలు పెట్టారు. వెంటనే స్థానిక యువకులు జై మంగళ దొరబాబు, ఘంటసాల సుబ్బు, ఘంటసాల కుటుంబరావు, బలే వెంకటేష్ తదితరులు పిల్లలు, వృద్ధులను మెరక ప్రాంతానికి చేర్చారు.

శాంతించాలని కోరుతూ గంగమ్మకు పూజలు

కష్టపడి కట్టుకున్న ఇల్లు వరద ప్రవాహంలో కొట్టుకుపోకుండా అధికారులు ఆదుకోవాలని కాలనీ వాసి మోరు విజయరామరాజు వేడుకున్నాడు. వరదల కారణంగా కొంప కొల్లేరు కాకుండా ఆదుకోవాలని మహిళలు పెద్ద సంఖ్యలో గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఇదే క్రమంలో మొండికోడు, కొక్కిరాయిలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, పెదయాగనమిల్లి, కలకుర్రు గ్రామాల ప్రజలు ఏ క్షణంలో వరదనీరు తమ గ్రామాలను ముంచెత్తుతుందోనని భయపడుతున్నారు. ఐదురోజులుగా సరస్సులోకి ప్రవాహం కొనసాగుతూనే ఉండడంతో పలు గ్రామాల పెద్దలు, ప్రజలు గ్రామాల్లోకి వరదనీరు రాకుండా బలహీన ప్రదేశంలో గట్లు పటిష్ట పరుస్తున్నారు. గుడివాకలంక వద్ద ప్రధాన రోడ్డుపై నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. భారీ వాహనాలు మాత్రమే రోడ్డుపై నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రయాణం నిలిచిపోయాయి. పలువురు చోదకులు భీమడోలు మండలం నుంచి జాతీయ రహదారికి చేరుకుని అక్కడ నుంచి ఏలూరు వస్తున్నారు.

కోమటిలంక ప్రజలు ఆందోళన

ఆరు రోజులు నుంచి వరద ప్రవాహం తగ్గకపోవడంతో కోమటిలంక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి ఉన్న ఒకే ఒక్క దారి కొట్టుకుపోవడం, గ్రామం చుట్టూ ఆవరించిన కొల్లేరు ప్రవాహం పెరగడం వల్ల ఏ క్షణం వరద ముంచెత్తుతుందోనని భయపడుతున్నారు. నిత్యావసర సరుకులు కోసం పురుషులు ప్రమాదకర స్థితిలో సైతం రేకు పడవలో వాగు దాటి వెళ్లి వస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

జిల్లా అధికార యంత్రాంగం కొల్లేరు గ్రామాల ప్రజలను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల తహసీల్దార్, ఎంపీడీఓ ఫోన్ చేసి చేతులు దులుపుకుంటున్నారని పెద్దలు ఆగ్రహిస్తున్నారు. మూడురోజుల క్రితం కలెక్టర్ కె వెట్రిసెల్వి కోమటిలంక పరిశీలించి వెళ్లినప్పటికీ, అధికారులు కనీసం తాగేందుకు చుక్కనీరు కూడా అందించలేదని గ్రామస్తులు వాపోయారు. ప్రమాదకర స్థితిలో పడవలో వరద ప్రాంతాన్ని దాటి నిత్యావసర సరుకులు తెచ్చుకుంటున్నామన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు నిత్యావసరాలు తెచ్చేవారు లేక దీనంగా ఎదురుచూస్తున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో పోలీసు అధికారుల పర్యటన

పెదపాడు: పెదపాడు మండలంలోని పలు లోట్టు ప్రాంతాలను ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ కే ప్రతాప్ శివ కిశోర్ పరిశీలించారు. పెదపాడు మండలంలోని పాతపెదపాడు, కొనికి, సత్యవోలు, నాయుడుగూడెం, వడ్డిగూడెం, గుడిపాడు గ్రామాల్లో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలకు చేరడంతో పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో వరద నీటి పరిస్థితిని పరిశీలించారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ వరదనీరుకు ఎదురుగా వెళ్లరాదని, వరదను అంచనావేస్తూ ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి ప్రాణ, ఆస్థినష్టం జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. బుడమేరుకు వచ్చిన వరద నీరు, పెదపాడు మండలంలోని పలు గ్రామాలు ముంపుకు గురైన నేపథ్యంలో సదరు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. కొణికి గ్రామంలో పర్యటించారు.

ఆగని వర్షం.. జన జీవనం అస్తవ్యస్తం

- ఇంటికే పరిమితమైన నగర వాసులు
- ఉధృతంగా ప్రవహిస్తున్న తమ్మిలేరు



ఏలూరు తూర్పులాకుల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తమ్మిలేరు

ఏలూరు (టూటౌన్): రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో నగరం తడిసి ముద్దయ్యింది. శుక్రవారం రాత్రి మొదలైన వర్షం ఆదివారం సాయంత్రం వరకు కురుస్తూనే ఉంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా కురిసిన వర్షానికి జన జీవనం స్తంభించింది. నగర ప్రజలు చాలా వరకు ఇంటికే పరిమితమవ్వాల్సి వచ్చింది. వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు, తోపుడు బళ్ల వ్యాపారులు నిరాశ చెందారు. డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తుండటంతో చాలా ప్రాంతాల్లో మురుగు నీరు రోడ్లపైకి చేరి వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు.

వెలవెలబోయిన వీధి వ్యాపారాలు

వర్షం దెబ్బతో ఆదివారం వీధి వ్యాపారాలతో ఎంతో బిజీబిజీగా ఉండే స్థానిక ఆర్ఆర్‌పేట మెయిన్ రోడ్డు వర్షం దెబ్బతో వెలవెలబోయింది. ప్రతి ఆదివారం వందల సంఖ్యలో వీధి వ్యాపారులు తమ దుకాణాలను రోడ్ల పక్క ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తుంటారు. నగర వాసులు కుటుంబ సమేతంగా ఈ మార్కెట్‌కు వస్తారు. వర్షం దెబ్బతో ఎక్కడా సందడి కనబడలేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో దుకాణాలు ఏర్పాటు చేసినా అవి వెలవెలబోయాయి.

రోడ్లపైకి చేరుతున్న మురుగు నీరు

రైల్వే ట్రాక్ వైపు నుంచి మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. రైల్వే ట్రాక్ వైపున ఉన్న మురుగు నీరు పారే డ్రైన్ పూర్తిగా వర్షం నీటితో నిండిపోవడంతో నగరంలోని రోడ్లపైకి ఎగదన్నుతోంది. మురుగు నీరు రోడ్లపైకి చేరడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న తమ్మిలేరు

భారీ వర్షాలకు తమ్మిలేరులో మళ్లీ నీటి ప్రవాహం పెరిగి ఉధృతంగా ప్రవహిస్తోంది. తమ్మిలేరు ప్రవాహం నేరుగా కొల్లేరులో కలిసే విధంగా ఏలూరు తూర్పు, పడమర వైపు గల లాకుల గేట్లను పూర్తి స్థాయిలో ఎత్తి ఉంచారు. తమ్మిలేరు ఉధృతి మరింత పెరిగితే స్థానిక అమీనాపేట-శనివారపు పేట మధ్య తమ్మిలేరుపై ఉన్న కాజ్‌వేపైకి నీరు చేరి రాకపోకలు స్తంభించే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

తిరుపతిలో హాథీరాం ఆలయాన్ని కాపాడుకుంటాం

ఏలూరు (టూటౌన్): తిరుమల తిరుపతిలో వేల కోట్ల ఆస్తులున్నా హాథీరాంజీ మఠం అధికారులు హాథీరాం బావాజీకి ఇంత వరకు ఆలయాన్ని నిర్మించలేదని బంజారా బజరంగీ భేరి నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీనివాసునితో పాచికలు ఆడిన చరిత్ర ఉన్న హాథీరాం బావాజీని బంజారాలు తమ దైవంగా ఆరాధిస్తారని, బంజారా నాయకులు తమ ఆధ్యాత్మిక ధర్మానికి మూలమైన హాథీరాం బావాజీకి ప్రపంచంలోనే ప్రప్రథమంగా తిరుపతిలో ఆలయాన్ని నిర్మిస్తుంటే దానిని హాథీరాం మఠం అధికారులు అడ్డుకోవడానికి ప్రయత్నించడం, భక్తుల వసతి గృహాల నిర్మాణాలను జేసీబీతో కూల్చేయడం అధర్మమని అన్నారు. ఇది తమ బంజారా జాతిని అణిచివేయడానికి, హాథీరాం నుంచి బంజారాలను దూరం చేసే కుట్రేనని బంజారా బజరంగీ భేరి జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ విమర్శించారు. హాథీరామ్ ఆలయ నిర్మాణాన్ని కూల్చే ఆలోచనను అధికారులు, ప్రభుత్వం శాశ్వతంగా విరమించుకుని ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఆలయ పరిరక్షణ కోసం దేశం నలుమూలల నుంచి బంజారాలు ఏకమవుతామని దశల వారీగా దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. బాబాలకు, ఆశ్రమాలకు వేల ఎకరాలు ఉచితంగా ఇస్తున్న ప్రభుత్వానికి వేల కోట్లు వచ్చేలా వేల ఎకరాలు 5 శతాబ్దాల క్రితమే అందించిన హాథీరాంకు ఒక్క ఆలయం కూడా లేకపోవడం బాధాకరమని బజరంగ్ భేరీ నాయకులు ధరావత్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. హాథీరాం మఠానికి సంబంధించిన ఆస్తులు అన్యాక్రాంతమైనా పట్టించుకోని అధికారులు నేడు ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవడం సరియైనది కాదని అన్నారు.

నాలుగు లక్షల ఆహార పొట్లాల పంపిణీ

ఏలూరు (టూటౌన్): విజయవాడ వరద బాధితులకు వారం రోజుల నుంచి ఇప్పటి వరకు దాదాపు 4 లక్షల ఆహార పొట్లాలు పంపిణీ చేసినట్టు ఏలూరు నగర కమిషనర్ ఎ.భాను ప్రతాప్, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు తెలిపారు. ఆదివారం రాత్రికి పంపించే ఆహార పొట్లాల లారీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. విజయవాడ వరద బాధిత ప్రాంతాలకు ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 7 రోజులుగా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రికి భోజనాలు సమయానికి పంపిస్తున్నామన్నారు. మరో తుఫాను ఉందని హెచ్చరికలు రావడంతో ఏలూరు చుట్టు పక్కల ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. నగర వాసులందరూ ఇళ్ల దగ్గర, పరిసర ప్రాంతాల్లో శుభ్రత పాటించాలని కోరారు. కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

11న అమర వీరుల వర్ధంతి కార్యక్రమం

ఏలూరు (టూటౌన్): విద్యుత్ పోరాట అమర వీరుడు సత్తెనపల్లి రామకృష్ణ, తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ, ప్రజా కళాకారుడు గరికిపాటి రాజారావు వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 11న ఉదయం 10 గంటలకు ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఆర్‌పేటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కో-కన్వీనర్ ఆగొల్ల వెంకట కృష్ణారావు ఆదివారం తెలియజేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	11
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	21
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	28
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	13
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	10
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	16
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	23
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	14
ఏలూరు - తిరుపతి	16.00	4830	06

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	50	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	56	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	7,10
బెండకాయలు	44	కంద	50
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	36
కాకర కాయలు	24	కీరా దోస	40
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	56	అల్లం	80-160
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	45
క్యారెట్	38	పాలకూర	12
దొండకాయలు	40	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	12
ఉల్లిపాయలు	58	గోంగూర	07
గోరుచిక్కుడు	38	పుదీనా	05
దోసకాయలు	28	బఠాణి	--
ఆనపకాయ (1)	25-30	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	52

10న విశాఖ స్టీల్ ప్లాంటు పరిరక్షణకు రాస్తారోకో



స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): విశాఖపట్టణం స్టీల్ ప్లాంటు విషయంలో కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని నిరసిస్తూ, స్టీల్ ప్లాంటు పరిరక్షణ కోసం ఈనెల 10న రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహిస్తున్నట్లు అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాల నాయకులు తెలిపారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఆధ్వర్యంలో రాస్తారోకో కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బండి వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. స్టీల్ ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు బీజేపీపై ఒత్తిడి తెచ్చి విశాఖ స్టీల్ ప్లాంటును కాపాడాలని కోరారు. ఈ నెల 10న నిర్వహించనున్న రాస్తారోకోలో కార్మికులు, ప్రజాసంఘాలు, రైతు సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు.

వైభవంగా గణేశ్ ఉత్సవాలు



కొత్తపేట బావిశెట్టి వారి వీధిలో గణపతి పూజల్లో పాల్గొన్న బాలలు



కొత్తపేట నూకాలమ్మ గుడి వద్ద వినాయక పందిరిలో భక్తులు



అశోక్‌నగర్‌లో గణేశ్ మందిరంలో యువకులు, బాలలు



పవర్‌పేటలో ఏర్పాటు చేసిన పందిరిలో పూజల్లో పాల్గొన్న స్థానికులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఉత్సవాలను ప్రారంభించి తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీల ప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నా నగరంలో వాడవాడలా ఏర్పాటు చేసిన పందిళ్లలో ఉత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో భారీ వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పవర్ పేటలో పదకొండున్నర అడుగుల ఏకశిలా విఘ్నేశ్వర స్వామి విగ్రహానికి విశేష ద్రవ్యాలతో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు నౌదురి శ్రీనివాస్, చీర్ల శ్రీనివాస్, ఆలబిల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం



కొల్లేరు ప్రాంతంలో వరద ముంపును పరిశీలిస్తున్న ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి

ఏలూరు (మెట్రో): వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా చేయడంతో పాటు అన్ని విధాల వారికి అండగా ఉంటామని ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి చెప్పారు. కలెక్టర్ వారి ఆదేశాల మేరకు వరద బాధితులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండవల్లి మండలంలో వరద ముంపునకు గురైన నూచుమిల్లి తదితర ప్రాంతాలను ఆదివారం ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి సందర్శించారు. ప్రజలను అప్రమత్తం చేసి గ్రామాలకు బోటు ఏర్పాటు చేసి రోడ్డు సౌకర్యం లేని చోట వరద ప్రభావిత ప్రాంతాలకు తాగునీటిని ఏర్పాటు చేశామన్నారు. స్థానిక గ్రామస్తులతో వరద పరిస్థితిపై మాట్లాడారు. కొల్లేరు ప్రభావిత మండలాల్లోని తహసీల్దార్లు, ఇతర అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ సహాయ పునరావాస కార్యక్రమాలు పర్యవేక్షిస్తామన్నారు. రేషన్ అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పెదఎడ్లగాడి వద్ద వరద పరిస్థితిని ఆర్డీవో పరిశీలించారు. వీరి వెంట స్థానిక తహసీల్దార్ తదితరులు ఉన్నారు.

గోగుంట గ్రామాన్ని సందర్శించిన ఏలూరు ఆర్డీవో

ఏలూరు (మెట్రో): వరద ముంపుకు గురైన పెదపాడు మండలం గోగుంట గ్రామాన్ని శనివారం ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి సందర్శించారు. కాలి నడకన గ్రామంలో పర్యటిస్తూ వరద ముంపుకు గురైన ఇళ్లను స్వయంగా పరిశీలించారు. స్థానిక గ్రామస్తులతో మాట్లాడి వారికి ఆహారం , పండ్లు పంపిణీ చేశారు.గోగుంటా గ్రామంలో 60 పైగా కుటుంబాలకు చెందిన సుమారు 150 మందికి వసంతవాడ జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన రిలీఫ్ సెంటర్ ను సందర్శించి బాధిత ప్రజలకు ఆహారం, వాటర్ బాటిళ్లు, పండ్లు అందజేశారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి, అందుబాటులో ఉన్న మందుల వివరాలు తెలుసుకున్నారు.